



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

దళితులకు శ్మశాన వాటిక స్థలాలు గుర్తించండి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో దళితులకు స్మశాన వాటికలకు స్థలాలు గుర్తించి త్వరగా నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వివిధ రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెస్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ల్యాండ్ , ఎస్‌సి కమ్యూనిటీకి సంబంధించిన స్మశానవాటికల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అసెస్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ల్యాండ్‌కు సంబంధించి గ్రామంలో ఎంత విస్తీర్ణం ఉంది, పట్టాదారుల భూమి, పోరం బోకు భూమి, కల్టివేటెడ్ భూమి ఎంత ఉంది అని తెలుసుకున్న తర్వాత మిగిలి ఉన్న భూమి వివరాల గురించి నిర్దేశించిన ప్రొఫార్మలో రూపొందించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటు దరఖాస్తులను డౌన్లోడ్ చేసి 2019లోపు పట్టభద్రుడై ఉన్నారా లేదా, సంబంధిత యూనివర్సిటీ ధ్రువపత్రాన్ని పరిశీలించి విచారణ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లో లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఆరేళ్ల కాలంలో మొత్తం మూడేళ్ల పాటు సెకండరీ గ్రేడ్ పాఠశాలలో పని చేశారా లేదా అని అలాగే ప్రైవేట్ టీచర్లు అయితే పనిచేసే పాఠశాల హెడ్ మాస్టర్ సంతకంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్ చేశారో లేదో అని పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా బియ్యం కార్డుల కొరకు 3251 మంది దరఖాస్తు చేసుకోగా 1298 డౌన్లోడ్ చేశామన్నారు. హౌసింగ్‌కు సంబంధించి మృతి చెందిన లబ్ధిదారుల, అర్హులైన లీగల్ హైర్‌లకు వచ్చే గురువారం నాటికి మ్యుటేషన్ చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. అదే విధంగా అనర్హులైన వారివి కూడా రద్దు పరచి కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ హక్కు పత్రాలు రాగానే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌పిఒఎల్‌ఆర్ రీ సర్వేకి సంబంధించి ప్రతి వారం 12 శాతం పనిలో పురోగతి సాధించాలని తహశీల్దార్లను ఆదేశించారు. డిఆర్‌ఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

- అద్దె బస్సులను దశలవారీగా రద్దుచేసి కొత్త బస్సులను కొనాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి ఉద్యోగుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగుల ఆర్థిక బకాయిలను తక్షణం విడుదల చేయాలని, బస్సులను దశలవారీగా రద్దుచేసి కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం కర్నూలు బస్టాండ్ ఆవరణలో ఆర్‌టిసి ఉద్యోగ కార్మికుల నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె. దివాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం తర్వాత తిరోగమన దిశగా ప్రైవేటీకరణ వైపు వేగంగా వెళుతున్నదని అన్నారు. విపరీతంగా అద్దె బస్సులను, విద్యుత్ బస్సులను తెచ్చి ఆర్‌టిసిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆర్‌టిసి ఆదాయానికి గండికొడుతూ ఆర్‌టిసి రూట్లో ప్రైవేట్ బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నా యన్నారు. ఆర్‌టిసి ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన 2017 వేతన ఒప్పంద అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ బకాయిలను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచారన్నారు.



బస్టాండ్ ఆవరణలో ప్రదర్శన నిర్వహిస్తున్న

అద్దె బస్సు, బెల్ట్ సార్టింగ్ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయకుండా, కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమదోపిడికి గురి చేస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఎస్‌డబ్ల్యుఎఫ్ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కార్యదర్శి వి. సంజీవ రాయుడు మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగుల మెరుగైన వైద్య సౌకర్యాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. ఎస్‌టి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగ కార్మికులకు ఓటి చెల్లించాలని, లేదా ఓటి డ్యూటీలను రద్దుచేసి ఎనిమిది గంటల పనిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జోనల్ నాయకులు కెసి.శేఖర్ మాట్లాడుతూ వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని, ప్రజల ప్రయాణ అవసరాల మెరుగుకు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉంచిన నైట్ అవుట్, డేఅవుట్, ఓటి అలవెన్సులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ నాయకులు ఎస్‌ఆర్‌కె. రెడ్డి, ఎం.ఆంజనేయులు, కర్నూలు 1 డిపో నాయకులు బి.నాగరాజు, శేషన్న, మద్దిలేటి, కర్నూలు 2 డిపో నాయకులు ఎ.దేవరాజు, శేషన్న, ఆర్‌ఎల్.నాయుడు, మునిస్వామి, సిసి.రంగస్వామి పాల్గొన్నారు.

రూ.48 కోట్ల

'అమృత్ నిధులెక్కడ..?

- నదులన్నీ కలుషితమవుతున్నా పట్టని పాలకులు
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని మురుగునీటి కేంద్ర నిర్మాణం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఒక కేంద్ర మంత్రితో పాటు జిల్లాలోని ప్రజాప్రతిథులందరూ రెండేళ్ల క్రితం ప్రారంభించిన మురుగునీటి శుద్ధికేంద్ర నిర్మాణం ఆగిపోయి అస్తిపంజరంలా తయారైంది. హిందూ స్మశానం ప్రక్కన హంద్రీ నదిలో నిలిచిపోయిన మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణాన్ని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎస్.నౌషాద్, ఎం.నాగరాజు, పి.ఇక్బాల్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వాటికి సంబంధించిన వివిధ శాఖల నుండి దాదాపు రూ.48 కోట్లు అమృత్ పథకం పేరుతో మంజూరు చేసాయి. 2020 సెప్టెంబర్ 27న రాష్ట్ర, కేంద్ర మంత్రులు జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. కానీ అది ఏక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు రెండు అడుగుల గోడలు కూడా నిర్మించలేదని, వాటి నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరు లక్షల జనాభాకు సంబంధించిన మురుగనీరంతా హంద్రీ, వక్కెర వాగు, తుంగభద్ర, కెసి కెనాలలో కలుస్తూ కాలుష్యం పెరిగిపోయి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నిధులు విడుదల చేసి వెంటనే మురుగు నీటి శుద్ధి కేంద్ర నిర్మాణం పనులు ప్రారంభించాలని కోరారు. ఎస్ శ్రీనివాసరెడ్డి ,చాంద్‌బాష ఉన్నారు.



నిలిచిపోయిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పి



రాత్రి గస్తీ పటిష్టం చేయాలి

- కర్నూలు డిఎస్‌పి కార్యాలయ తనిఖీలో ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాత్రి గస్తీని కర్నూలు పట్టణంలో ప్రతిష్టంగా నిర్వహించాలని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు పట్టణ డిఎస్‌పి కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ముందుగా పోలీసు గార్డు సిబ్బంది జిల్లా ఎస్‌పికి గౌరవవందనం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. వారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు డిఎస్‌ప కార్యాలయంలో కర్నూలు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేరాలపై సమీక్షించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. కర్నూలు సేఫ్ సిటిలో భాగంగా రాత్రిపూట గస్తీని పెంచి నిఘాను పటిష్టం చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పటిష్టంగా ఉండాలన్నారు. నేరాల నియంత్రణ కు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రీవెన్స్ కేసుల గురించి విచారించి పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ పరిధి దూరం ఎక్కువగా ఉన్నందున ప్రజల సంక్షేమం దృష్ట్యా 2 పోలీసు స్టేషన్లుగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పోలీసు ఉన్నతాధికారులకు పంపాలని కర్నూలు డిఎస్‌పి కెవి. మహేష్‌కు సూచించారు. డిఎస్‌పి, సిఐలు శ్రీనివాసులు, త్రబేజ్, శ్రీనివాసరెడ్డి, రామలింగయ్య, శంకరయ్య, ఎస్‌ఐలు, మల్లికార్జున, విష్ణునారాయణ, పీరయ్య ఉన్నారు.

టాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు సూచన

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్ల పంపిణీ వల్ల ఎంతో మేలు జరుగుతుందని, ట్యాబ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు డిఇఒ రంగారెడ్డి ఎంపిపి బోయ శారద, సర్పంచ్ లక్ష్మన్న జెడ్పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి నక్క స్వాములు ట్యాబ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్లను వినియోగించడం నేర్చుకున్న తర్వాత కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ఫలితాలను సాధిస్తారన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చేనేత హస్తకళలను ప్రోత్సహిద్దాం : మేయర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చేనేత, హస్తకళలను ప్రోత్సహిద్దామని కర్నూలు మేయర్ బివై. రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ ప్యాలెస్‌లో శ్రీఉషోదయ హ్యాండ్లూమ్స్ అండ్ హాండీక్రాఫ్స్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీఉషోదయ చేనేత హస్తకళా మేళాను శుక్రవారం మేయర్ ప్రారంభించారు. ముందుగా చేనేత హస్తకళాకారులు తయారు చేసిన వస్త్రాలు, తదితర వస్తువులను మేయర్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మేయర్ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో అంతర్భాగమైన చేనేతలు, హస్తకళల జీవన సౌందర్యానికి ప్రతీకలని, వాటిని ప్రోత్సహించి కళాకారులకు చేయూత నివ్వాలని కోరారు. హస్తకళలను ఆదరించి చేనేతలను ఆదుకుంటామని, వ్యవసాయం తర్వాత ప్రధానమైన చేనేత వస్త్ర పరిశ్రమని, ప్రపంచ దేశాలు సైతం అబ్బురపడే కళానైపుణ్యం గల హస్తకళకారులు భారతదేశంలో ఎంతో మంది ఉన్నారన్నారు. కళకారులను ప్రోత్సహించి కళలు మరుగున పడకుండాచూడాలని, చేనేతలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు వస్తువులను వాడాలని ప్రజలును కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కరువై కొంతమంది జీవనోపాధిని వెతుక్కోవడం విచారకరమని, మనం బతుకుతూ పది మందిని బతికించుకుందామనే సంకల్పంతో చేనేత హస్తకళాకారుల సంక్షేమం కోసం, నిరుద్యోగ, వికలాంగుల శ్రేయస్సు కోసం వారి జీవనోపాధికి కళాకారులు అందరు కలిసి శ్రీ ఉషోదయ సంఘం ఏర్పాటు చేశారన్నారు. గాంధీ మహాత్ముడు ఆనాడే స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, చేనేత దుస్తులను ధరించాలని అన్నారని తెలిపారు. ఈ ప్రదర్శనలో మంచి మన్నిక గల దుస్తులు ,వస్తువులు ఉంచారని, కర్నూలు నగర ప్రజల జిల్లా ప్రజలు దేవిఫంక్షన్‌హాల్‌ను ఒకసారి సందర్శించి దుస్తులను, వస్తువులనుకొని వారికి మీ చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. మేళా వచ్చే నెల 12 వరకుకొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో దేవి ఫంక్షన్ హాల్ మేనేజర్ చంద్రశేఖర్, శివసాయి హాస్టల్స్ అధినేత లక్ష్మినారాయణ, సంఘం కార్యదర్శి శనిగం. కిశోర్, సభ్యులు గంజి సంతోష్ కుమార్, మోహన్ మండల్, హుస్సేన్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న మేయర్



రాయలసీమ మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

రాయలసీమ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రాలయసీమ అభివృద్ధికోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. సీమ భవిష్యత్తుకోసం రాయలసీమ మేధావుల సమావేశం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన స్టాంటాన్ పురంలోని బైరెడ్డి ఫంక్షన్ హాలులో రాయలసీమ విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, సీమ అభివృద్ధి కాముకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రాయలసీమ చాలా వెనకబాటుకు గురైందన్నారు. మద్రాస్ నుండి ఒకసారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఒకసారి, మళ్ళీ ఇప్పుడు వెనకబాటునే ఎదుర్కొంటుందన్నారు. అందరం ఒక వేదికగా ఏర్పాటు అవ్వాలని రాయలసీమ జిల్లాల మేధావులు, రాజకీయ పార్టీలు, విద్యార్థులు కలిసి రావాలన్నారు. మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు పరిశ్రమలు, వ్యవసాయాభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు వస్తేనే అభివృద్ధి అవుతుందన్నారు. ముందు వ్యవసాయ సంక్షోభం, తాగు, సాగునీటి అభివృద్ధి, నిరుద్యోగం నుండి బయటపడాలన్నారు.

విద్యార్థి దశనుంచే ఎబివిపితో అనుబంధం

41వ రాష్ట్ర మహాసభ ప్రారంభంలో టిజివి


ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : పాఠశాల దశ నుంచే ఎబివిపితో సంబంధాలున్నాయని మాజీ ఎంపి టిజి వెంకటేష్ అన్నారు. కర్నూలు ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో ఎబివిపి 41వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్ల, ప్రతినిధులు ఆశిష్ చౌహాన్, పార్థసారథి, నాగఫణి శాస్త్రి, మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు. టిజివి మాట్లాడుతూ తాను పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఎబివిపితో అనుబంధం ఉందని గుర్తు చేశారు. తాను చదువుకునే రోజుల్లో ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ప్రస్తుత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాయలసీమలో ఎస్‌వి యూనివర్సిటీ నుంచి తాను, తెలంగాణ నుండి ఇంద్రసేనారెడ్డి అధ్యక్షులుగా ఉండే వారన్నారు. యువమోర్చాతో అనుబంధాన్ని కొనసాగించానన్నారు. శ్రీకాంత్‌బొల్ల తదితరులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎబివిపి చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ, రాష్ట్ర జిల్లా నాయకులు ,ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిజి.వెంకటేష్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని 25వ వార్డు 64వ సచివాలయం హౌసింగ్ బోర్డు కాలనీ, ఠాగూర్ నగర్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు కావలిసిన ప్రతి అవసరానికి అనుగుణంగా సంక్షేమ పథకాలతో ఆదుకుంటుంటే ఓర్చుకోలేని కొన్ని శక్తులు ప్రజలను తప్పదోవ పట్టించాలని శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. జగనన్న పైన మన రాష్ట్ర ప్రభుత్వ పని తీరు పైన ఎంతో ప్రేమతో ప్రతి గడపవద్ద సంతోషంగా స్వాగతం పలుకు తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చాలా మంది ఉచితంగా హాస్పిటల్స్‌లో ఎన్నో రకాల వ్యాధులకు ఈరోజు ట్రీట్మెంట్ చేయించు కుంటు న్నారన్నారు. సచి వాలయం వ్యవస్థ ద్వారా ప్రతి పని ఇంటి దగ్గరే గంటల వ్యవధిలో పనులు పూర్తవు తున్నాయని తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలు కూడా మన ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోనే స్థాయిలో మన పాలన సాగుతుందన్నారు. వార్డు కార్పొరేటర్ వైసిపి నగర అధ్యక్షులు సత్యనారాయణమ్మ, వార్డు ఇన్చార్జి గడ్డం రామకృష్ణ సచివాలయం, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

సిబిఎస్ఇ అమలు చేయొద్దు :ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో సిబిఎస్ఇ విధానం అమలు చేయాల్సిన అవసరం లేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. ఈ విధానం అమలు చేయడానికి అవసరమైన వసతులు ప్రభుత్వ పాఠశాలలో లేవని డిఇఒ దృష్టికి తెచ్చారు. శుక్రవారం సాయంత్రం డిఇఒ వెంకట రంగారెడ్డి సిబిఎస్ఇ విధానం అమలుపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు రంగన్న, ఆప్టా నాయకులు సాగర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యను మరింత బలోపేతం చేయాలన్నారు. సిబిఎస్ఇ అమలకు తగిన వసతులు ఏ ప్రభుత్వ పాఠశాలలో లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానమే మరింత పటిష్ట పరచాలన్నారు. సిబిఎస్ఇని వ్యతిరేకిస్తున్నట్లు జయరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటీకరణ చేయడమే దీని ఉద్దేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు మరింత శిక్షణ ఇచ్చి ట్రైన్ చేయాలన్నారు.కర్నూల్ డిప్యూటీ డిఇఒ హనుమంతరావు, ప్రయివేట్ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు



డిఇఒతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ నేతలు

ఘనంగా కాటసాని శివ నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వారసుడు పాణ్యం యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులనడుమ అట్టహాసంగా నిర్వహించారు. కాటసాని నివాసంలో వైసిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి సెల్ శివ సందేపోగు వారి మిత్ర బందం కలసి యువనేతకు శాలువా కప్పి, గజమాలవేసి కేక్ కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ కాశపోగు జయరాముడు, కాశపోగు సంజన్న, కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సానశ్రీనివాసులు పాల్గొన్నారు.

పలు సేవా కార్యక్రమాలు: పాణ్యం నియోజకవర్గ పరిధిలోనే కాక, కర్నూలు జిల్లా వ్యాప్తంగా యువనేత కాటసాని శివనరసింహారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి యువజన విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు నగర మార్కెట్‌యార్డులో యువనేత జన్మదిన వేడుకలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి యువనేతకు శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో: యువనేత కాటసాని శివ నరసింహ రెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. యువనేతను ఘనంగా సన్మానించారు. కల్లూరు కార్పొరేటర్ మైతాపు నరసింహులు, వైసిపి నాయకులు బెక్కం మహేశ్వర రెడ్డి, రంగప్ప, ఎం.ఎ.భాష, ఇలియాస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొంతమంది అభిమానులు యువనేతకు చిత్రపటం బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ తినిపించి గ్రీటింగ్స్ చెబుతున్న అభిమానులు

కైకాల మృతికి సంతాపం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : నవరస నటన సార్వభౌముడు వెండితెర యముడు సహజనటుడు కైకాల సత్యనారాయణ అద్భుతనటులని ఆయన మృతి సినీరంగానికే కాదు..యావత్తుకళారంగానికే తీరనిలోటని లలితకళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయనొక సంతాపప్రకటన విడుదల చేశారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా విలన్‌గా కమెడియన్‌గా రకరకాల పాత్రలను పోషించి తనదైన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న కైకాల సత్యనారాయణ నాటి తరం నేటితరం చలనచిత్ర కధా నాయకుల సారధి ఆయ ునేనని కర్నూలు కళాకారుల సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీవుల్లా తెలిపారు. 60 సంవత్సరాల సుదీర్ఘ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 777 సినిమాలలో నటుడిగా పౌరాణిక సాంఘిక జానపద హాస్య ప్రతినాయక పాత్రలను పోషించిన కైకాల పోషించిన వైవిధ్య భరితమైన పాత్రలకు జీవం పోసిన కైకాల చిరస్మరణీయుడని ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి బసవరాజు తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కర్నూలు కలెక్టరేట్: మంత్రాలయం మండలం బుడూర్ మండల పరిషత్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులను డిఇఒ వెంకట రంగారెడ్డి శుక్రవారం సస్పెండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరించడంతో వెంటనే ఉపాధ్యాయుడిని విధుల నుండి సస్పెండ్ చేసినట్లు డిఇఒ పేర్కొన్నారు



విద్యార్థినులకు బెల్టులు ప్రదానం చేస్తున్న అతిథులు, శిక్షకులు

ఆత్మరక్షణకు కరాటే అవసరం

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

ఆత్మ రక్షణ కోసం కరాటే సాధన అవసరమని , సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళ సాధికారిక విభాగం ఆధర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్‌టెస్ట్ నిర్వహించామని మాస్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మిస్ వై.శౌరీలు రెడ్డి. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శాంత మాట్లాడుతూ మహిళలకు ఈ రోజుల్లో కరాటే, ఉషూ లాంటి మార్షల్‌ఆర్ట్స్ నేర్చుకోవాలని, ఆత్మరక్షణ కోసం ఆరోగ్యం పెంపొందించుకోవడానికి ప్రతిరోజు క్రమం తప్ప కుండా శిక్షణను తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆరెంజ్ బెల్టు సాధించిన విద్యార్థినీలకు ముఖ్య అతిథులు బెల్టులను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మహిళా సాధికారిక విభాగం కన్వీనర్ ఎస్.షహనాజ్ బేగం , విభాగం సభ్యులు శిక్షకులు మాస్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ రామానుజులు

విద్యతోనే భవితకు నాంది

- ఎస్ఐ రామానుజులు

ప్రజాశక్తి-ఆలూరు

విద్యతోనే భవితకు నాంది అని ఎస్ఐ రామానుజులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆలూరు గిరిజన గురుకుల బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జనసేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు విరుపాక్షి అధ్యక్షతన 'మూఢనమ్మకాలు, రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇంద్రజాల ప్రదర్శన' చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే పట్టుదల, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు గ్రూపు కార్డులను అందజేశారు. జనసేవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునాక్, వీరేశ్, మణి, ల్యాబ్ టెక్నీషియన్ నాగార్జున, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జమ్మన్న, ఉపాధ్యాయులు రాజేశ్వరి, రవి కుమార్, పెద్దయ్య, సుధ ప్రశాంతి, మాధవి, సాయిప్రియ పాల్గొన్నారు.

గురుకులంలో నూతన భవనం ప్రారంభం

- బీవీ.మోహన్ రెడ్డి కృషితోనే పాఠశాల - ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని బనవాసి గురుకుల పాఠశాలలో నూతన భవన సముదాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పాఠశాలను గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో కట్టించాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే బీవీ.మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావుతో పట్టుపట్టి ఇక్కడికి తెప్పించారని కొనియాడారు. తర్వాత కోట్ల విజయభాస్కర్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించినట్లు చెప్పారు. తన చేతులమీదుగా నూతన భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అందుకు ప్రిన్సిపల్ సాజిదా బేగంకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపిపి గొల్ల కేశన్న, మున్సిపల్ ఛైర్మన్ రఘు, బసిరెడ్డి, ప్రిన్సిపల్ సాజిదా బేగం పాల్గొన్నారు.

టిడిపి అధికారంతో మంచి రోజులు...

- టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం


మాట్లాడుతున్న నాయకులు ఉల్లిగయ్య

రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పేర్కొన్నారు. శుక్రవారం గోతులదొడ్డి గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ లేవన్నారు. ఇలాంటి పాలనను ప్రజలు ఎప్పుడూ చూడలేదన్నారు. ఏం కొనాలన్నా, ఏం తినాలన్నా ప్రజలు ఆలోచించాల్సిన రోజులు జగన్ ప్రభుత్వంలో ఏర్పడ్డాయని తెలిపారు. జగన్ ప్రభుత్వాన్ని సాగనంపి, చంద్రబాబు నాయుడు పాలనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గోవిందు, సిద్ధప్ప, కృష్ణ, మహంతేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

'మిగులు గ్రామాలకు సాగు నీరందించాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని హంద్రీనీవా ద్వారా లబ్ధి పొందని మిగులు గ్రామాలైన భైరవ కుంట, బుర్ర కుంట, వెంకటాపురం, నేలతలమారి, గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెల్లెల చెలెమిల, బేతపల్లి, బండపల్లె, పల్లె దొడ్డి గ్రామాలకు సాగునీరందించాలని లోక్ సత్తా పార్టీ ఆదోని డివిజన్ కన్వీనర్ శేఖర్, ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఇ.రామదాసు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హంద్రీనీవా ద్వారా లబ్ధి పొందని మిగులు గ్రామాలకు సాగు నీరందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు ఓబుల్ రెడ్డి నాయుడు, దొరస్వామి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రామాంజనేయులు, కిషోర్, ప్రసాద్, జాన కుమార్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

- కూలిన తరగతి గది
- తప్పిన పెను ప్రమాదం
- విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాఠశాల తరగతి గది కూలింది. విద్యార్థులు ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం పాఠశాల తరగతి గది గోడ పడిపోవడంతో విద్యార్థులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి స్వల్ప గాయాలకు గురయ్యారు. హాల్వి గ్రామంలోని ఎస్‌డబ్ల్యు ప్రాథమిక పాఠశాలకు రోజూ మాదిరిగానే విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. పాఠశాలలో 105 మంది విద్యార్థులకు గాను 58 మంది హాజరయ్యారు. అమావాస్య కావడంతో రైతుల ఇళ్లలో పండగ ఉండడంతో విద్యార్థుల హాజరు శాతం కూడా తక్కువగా ఉంది. ఈ పాఠశాలకు నాడు-నేడు పథకం కింద రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల్లో భాగంగా పాఠశాల పక్కనే ఉన్న పాత గదులను తొలగించేందుకు పనులు చేపట్టారు. జెసిబి ద్వారా తొలగిస్తున్న సమయంలో పాత పాఠశాల గదుల పైకప్పు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 5వ తరగతి గది గోడపై కూలింది. పాఠశాల తరగతి గోడ కూలిపోవడంతో ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో 5వ తరగతి విద్యార్థినులు జెస్సికా, సాబ్ దిన్, శబరిన్, వరుణ్ సందేశ్, 1వ తరగతికి చెందిన రత్న అనే విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు, చుట్టుపక్కల వారు ఆగ్రహంతో పాఠశాల వద్దకు తరలి వచ్చారు. ప్రధానోపాధ్యాయులు రఘువీరా తనపై దాడి చేస్తారనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

సాహసం చేసిన ఉపాధ్యాయులు సుజాత

పాఠశాల గోడ పడిపోవడంతో తరగతి గదిలోని విద్యార్థులు కేకలు పెట్టారు. ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు సుజాత వెంటనే అప్రమత్తమై విద్యార్థులకు ఒక్కొక్కరిని బయటకు లాగి సురక్షితంగా బయట పడ్డారు. చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకోవడంతో ఏ విద్యార్థికి ఏ ప్రమాదం జరిగిందోనని ఆందోళన చెందారు. ఉపాధ్యాయులు సుజాత చేసిన పనిని అందరూ మెచ్చుకున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వైద్య సిబ్బందికి సమాచారం అందించి 104 వాహనాన్ని పాఠశాల వద్దకు తెప్పించారు. వైద్య సిబ్బంది ద్వారా చికిత్స అందించారు. సంఘటనకు గల కారణాలను, కాలనీ వాసులు చేసిన ఫిర్యాదును తీసుకొని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థులకు ఏమైనా జరగరానిది జరిగి ఉంటే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సంబంధిత వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కూలిన పాఠశాల తరగతి గది

అధికారుల నిర్లక్ష్యం తగదు

హాల్వి గ్రామంలో జరిగిన సంఘటనలో అధికారుల నిర్లక్ష్యం తగదని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు చెన్నప్ప, అడివప్ప గౌడ్ వేర్వేరుగా ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు పాటించకపోవడం తగదన్నారు. ప్రాణ నష్టం జరిగి ఉంటే ఎవరు బాధ్యులని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల చికిత్స నిమిత్తం శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నూర్పిడి యంత్రాలను ప్రారంభిస్తున్న నాయకులు

మహిళలు స్వశక్తితో ఎదగాలి

- దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే ఆ కుటుంబం పచ్చగా ఆర్థికంగా ఉంటుందని దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. శుక్రవారం గుమ్మనూరు గ్రామంలో గుడ్ల మహేష్ భార్యకు రాయితీపై మంజూరయిన జొన్నలు, బియ్యం, కారం నూర్పిడి యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సర్పంచి లక్ష్మీదేవి, ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు ఏదో ఒక వ్యాపారం చేసుకొని తన సొంత కాళ్లపై నిలబడినప్పుడే మహిళలకు ఒక గుర్తింపు ఉంటుందని తెలిపారు. పురుషులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగడానికి మహిళలు ప్రయత్నించాలని కోరారు.

కబడ్డీ విజేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి జట్టు

కోసిగి రూరల్ : శ్రీమారెమ్మ దేవర ఉత్సవాల సందర్భంగా దుద్ది గ్రామంలో నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో చిన్నబొంపల్లి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి జట్టు, పల్లెపాడు గ్రామానికి చెందిన జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ప్రథమ స్థానం లక్ష్మీ నరసింహ స్వామి జట్టు కైవసం చేసుకోగా రెండో స్థానంలో పల్లెపాడు జట్టు నిలిచింది. అలాగే మూడో స్థానం దుద్ది మారెమ్మ దేవి జట్టు, నాలుగో స్థానంలో చెన్నకేశవ జట్టు నిలిచింది. ఈ క్రీడలు వ్యాయామ ఉపాధ్యాయులు కేశవ, బసవరాజు, ఆనంద్, నాగరాజు, విజయ్ ఆధ్వర్యంలో జరిగాయి. శుక్రవారం గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.5116 ఎపియుడబ్ల్యుజె మండల ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, ద్వితీయ బహుమతి రూ.3116 తుసేని చిన్న లక్ష్మన్న, తృతీయ బహుమతి రూ.2116 సర్పంచి వరలక్ష్మి, నాలుగో బహుమతి రూ.1116 ఈశ్వరయ్య అందజేశారు. గ్రామ పెద్దలు, యువకులు ఎండపల్లి మూకయ్య, మల్లేష్, నీలప్ప, రమేష్, ఈశ్వరయ్య, మహ్మద్, వీరేష్, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి విరుపాక్షి

తారాస్థాయికి విభేదాలు

- చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి రాజీనామా
- వైసిపిలో రాజీనామా కలకలం

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో ఏర్పడిన విభేదాలు తారాస్థాయికి చేరడంతో చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి పదవికి శుక్రవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. విరుపాక్షి రాజీనామా వ్యవహారం ఆలూరు వైసిపిలో రాజకీయ కలకలం రేపింది. ఈ విషయంపై విరుపాక్షి విలేకరులతో మాట్లాడారు. మంత్రి జయరాం వర్గీయులు ప్రతిసారీ తనకు వచ్చిన పదవిని జయరాం వేసిన భిక్షగా అవహేళనగా మాట్లాడటం తన మనస్సును కలిచి వేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతోనే తాను పార్టీలోకి వచ్చానని తెలిపారు. తనకు మొదటి నుంచీ వైఎస్.రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డిపై అభిమానం ఉండడంతో వైసిపిలో కొనసాగుతున్నానని చెప్పారు. ఈ వ్యవహారమంతా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రెండేళ్లుగా విభేదాలు : మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు, విరుపాక్షికి మధ్య రెండేళ్లుగా విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా చిప్పగిరి మండలం పాలన వ్యవహారమంతా మంత్రి గ్రూపునకు చెందిన వారికి అప్పజెప్పడంతో విభేదాలు తలెత్తాయి. బాధ్యులు కూడా మండల రాజకీయ వ్యవహారాలు తన కనుసన్నల్లో నడిపించడంతో జడ్‌పిటిసి విరుపాక్షి మాట చెల్లుబాటు కాలేదు. ఇలా వీరి మధ్య విభేదాలు పెరుగుతూ పోయాయి. ఈనెల 21న జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు నిర్వహించిన ర్యాలీలో ఎదురెదురుగా రావడంతో ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఇరు గ్రూపుల మధ్య విభేదాలు వేడెక్కాయి. చిప్పగిరి జడ్‌పిటిసి రాజీనామా వ్యవహారం ఆలూరు వైసిపిలో ఎంతవరకు నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.

'ఉపాధ్యాయుని శిక్షించాలి'

- వత్తాసు పలుకుతున్న ఎంఇఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని బూదూరు ప్రాథమిక పాఠశాలలో 2, 3 తరగతులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులును కఠినంగా శిక్షించాలని, ఆయనకు వత్తాసు పలుకుతున్న ఎంఇఒ మోహినుద్దీన్‌ను సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు థామస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న లలితకు వినతి పత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జాను, రాము, వినోద్, అరవింద్, రాముడు, వీరేష్ పాల్గొన్నారు.

బిజెపికి ఊడిగం చేయడం తగదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

బిజెపికి తొత్తులుగా మారి ఊడిగం చేయడం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. కార్పొరేట్ల ఆర్థిక బలోపేతానికి సహకరిస్తూ వారి అడుగులకు మడుగులొత్తుతున్న కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలం చెందాయని విమర్శించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాలులో డివిజన్ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదల ఆర్థిక అభివృద్ధికి పాటుపడాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఆస్తులను పెంచుకునే దిశగా వారికి అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడంలో రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు విఫలం చెందాయని విమర్శించారు. బిజెపితో జతకట్టేందుకు పోటాపోటీగా వెంపర్లాడుతున్నాయని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు సాగు చేసి జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. రైతుల ఆర్తనాదాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తామని ఆర్‌బికెలు నెలకొల్పారని, వాటి వల్ల ఎలాంటి ప్రయోజనమూ చేకూరకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా వారి ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూదొందేనని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా, ప్రాజెక్టుల నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులను రాబట్టడంలో ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి అభివృద్ధి చేస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వారి ముందు మోకరిల్లారని విమర్శించారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బిజెపి పావులు కదుపుతోందన్నారు. వారు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు, కెవి.నారాయణ, పట్టణ మండల కార్యదర్శి లక్ష్మణ్, లింగన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్


మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

పింఛన్లు పోతాయనే అపోహలొద్దు : ఎంపిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరీ పింఛన్లు ఉంటాయని, అపోహలను నమ్మవద్దని ఎంపిపి జూటూరు హేమలత పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆమె విలేకరు ల సమావేశంలో మాట్లాడారు. మండలంలో కొత్తగా 161 పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. రూ.2500 నుంచి రూ.2750 పెంచినట్లు జిఒ కూడా వచ్చిందన్నారు. పెంచిన అమౌంటును జనవరి నుంచి అందిస్తామన్నారు. పింఛన్లు వెరిఫికేషన్ మాత్రమే చేస్తారని, తొలగిస్తారని ఎవరూ అపోహ పడవద్దని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమన్నారు. జనవరిలో పొదుపు సంఘం సభ్యులకు మూడో విడత రుణమాఫీ ఉంటుందని తెలిపారు. వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు 'నారాయణ' విద్యార్థి

ప్రజాశక్తి-కోసిగి రూరల్

కోసిగి డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న మహేష్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. డోన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో మహేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 23 నుంచి 27 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలీ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ హుస్సేనయ్య మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు ఇటు చదువులోనూ, ఇటు ఆటల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో మంచి తర్ఫీదును ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ బాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ చౌడయ్య, వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, అధ్యాపకులు కాడయ్య, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- చిన్న హ్యాటలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - హొళగుంద

గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నహ్యాట గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గ్రామంలో పూలమాలలు, బాణసంచా పేల్చుతూ, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. మొదట నూతన గ్రామ సచివాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రజల సంక్షేమం, సచివాలయ సేవల గురించి ఆరా తీశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి జయరాం

గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటిస్తుండగా... తాగునీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే మంత్రి స్పందించి తాగునీటి పైపులైన్, సిసి రోడ్ల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. వెంటనే ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నహ్యాట గ్రామ పరిధిలో పెద్దహ్యాట, బిజి.హళ్లి గ్రామాలకు కలిసి జలమిషన్ కింద నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. అలాగే బిజి.హళ్లి గ్రామానికి నాడు-నేడు కింద దాదాపు రూ.కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, ఎంపిటిసి శివ, మండల కన్వీనర్ షఫీ, ఎంపిపి తనయుడు ఈషా, జడ్‌పి వైస్ ఛైర్మన్ బావ శేషప్ప, వైసిపి నాయకులు కుమార్ స్వామి, రామకృష్ణ, హనుమప్ప, నాగప్ప, మల్లికార్జున, బిజి.హళ్లి శివ, వెంకటేష్, సర్పంచి రమేష్, చంద్రశేఖర్, ఎస్‌కె.గిరి, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, మాజీ జడ్‌పిటిసి రాంభీం నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్రీచైతన్య-1 పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ గౌసియా ఖనమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను శుక్రవారం నిర్వహించారు. గౌసియా ఖనమ్ మాట్లాడుతూ... గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేయడంలో శ్రీనివాస రామానుజన్ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. గణిత శాస్త్రాన్ని చదివిన విద్యార్థి చురుకుదనం కలిగి ఉంటారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎజిఎం సురేష్, ఆర్ఐ రంగారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎఒ అశోక్, డీన్ చిట్టిబాబు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

మరింత అభివృద్ధి సాధించాలి

- వైసిపి యువ నాయకులు జయమనోజ్‌రెడ్డి
- ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న ప్రజాశక్తి నిరంతరం అభివృద్ధి సాధించాలని వైసిపి యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు ఆకాంక్షించారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ప్రజాశక్తి 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కార మార్గాన్ని కూడా ప్రజాశక్తి ప్రస్తావిస్తుండడం అభినందనీయమని తెలిపారు. రాబోయేకాలంలో మరింత ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు రాఘవరెడ్డి, సందీప్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దేవా, నాయకులు సన్నీ, వినోద్ రెడ్డి, ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, విలేకరి తిమ్మప్ప పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప
- ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

సాగు చేసిన పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని జనసేన తాలూకా ఇన్‌ఛార్జీ మల్లప్ప విమర్శించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదోనిలోని పార్టీ కార్యాలయంలో రైతులను సన్మానించారు. ఏడుగురు రైతులకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. నకిలీ పత్తి విత్తనాలు, అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు సంక్షోభంలో ఉన్నా కనీసం పట్టించుకున్న నాథుడే లేడన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆపన్న హస్తం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. కౌలు రైతులు చనిపోతే జనసేన అధినేత పవన్ కల్యాన్ రూ.లక్ష చొప్పున పరిహారం అందజేశారని, అధికార పార్టీ నాయకులు అవహేళనగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని కోరారు. నాయకులు రాజశేఖర్, రేణువర్మ, మహేష్ యాదవ్, ఎం.తాహేర్ వలీ, పులి రాజు, రామకృష్ణ, వెంకటేష్, విజయ్, తిమ్మప్ప, వలీ బాష, రాజశేఖర్,


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మల్లప్ప

ఉరుకుందు ఉన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో 'కిసాన్ దివాస్' నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్న వెంకటాపురం గ్రామానికి చెందిన దివాకర్, చెన్నాపురం గ్రామానికి చెందిన నారాయణను సన్మానించారు. సమన్వయ కర్త డాక్టర్ పి.సుజాతమ్మ, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రమేష్ నాయక్, పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట నిరంజన్ రెడ్డి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.అపర్ణ, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వై.మౌనిక, వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్త ఎం.మహదేవయ్య పాల్గొన్నారు.

లింగ వివక్షపై ర్యాలీ

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో 'లింగ వివక్ష'పై శుక్రవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ ముగింపు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా ర్యాలీగా బస్టాండ్‌కు వచ్చి మానవహారం ఏర్పడి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపిడిఒ గౌరీదేవి, ఎపిఎం రమేష్ మాట్లాడారు. లింగ వివక్ష, బాల్య వివాహాలు, ఫోక్సో 2013, చట్టం, గృహ హింసపై అవగాహన కల్పించారు. ఎఒ సురేష్ బాబు, వైఎస్ఆర్ క్రాంతి పథం సిబ్బంది ్త, ప్రభాకర్, స్వామన్న, మాధులు, శివరంగడు పాల్గొన్నారు.

శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - చిప్పగిరి


పట్టాలు పంపిణీ చేస్తున్న నారాయణ, సర్పంచి రమాదేవి

మండలంలోని కాజీపురం గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో 26 మంది లబ్ధిదారులకు మంజూరయిన జగనన్న శాశ్వత ఇంటి పట్టాలను సర్పంచి రమాదేవి, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇల్లు లేని నిరుపేద మహిళలకు ఇల్లు కట్టించి ఇస్తున్నారన్నారు. మంత్రి జయరాం సహకారంతో తమకందరికీ ఇంటి పట్టాలు అందించడం సంతోషంగా ఉందని మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు రమేష్, నాగరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఆదోని : ఆర్‌టిసి ఉద్యోగ, కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు అజీమ్ ఖాన్, డిపో నాయకులు ప్రసాద్, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని ఆర్‌టిసి డిపో ముందు ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, ప్రస్తుత అద్దె బస్సులను దశలవారీగా రద్దు చేయాలని కోరారు. ఆర్‌టిసిలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కృష్ణమూర్తి, రవి, వీరేష్ పాల్గొన్నారు.

అప్పుల బాధలో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-వెల్దుర్తి (కర్నూలు)

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చెరుకులపాడు గ్రామానికి చెందిన రైతు బాలస్వామి (35)తన మూడెకరాల సొంత పొలంతో పాటు మరో ఎకరాను కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. మాండూస్ తుపాను ప్రభావంతో వరి పంట దెబ్బతిన్నది. పంట సాగు, కుటుంబ పోషణ కోసం సుమారు రూ. ఏడు లక్షలు అప్పు చేశారు. పంట మొత్తం దెబ్బతిన్నడం, అప్పుల తీరే దారి లేక తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పివికి ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాజీ ప్రధానమంత్రి పివి. నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం స్థానిక డిసిసి కార్యాలయంలో పివి చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పివి చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ ,బతకన్న పోతుల శేఖర్ ,సత్యరాజ్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరీన్ నగర్ లో అగ్నిప్రమాదం

దగ్ధమైన గుడిసెలు

బాధితులకు చేయూతనిచ్చిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 29వ వార్డు నాగభూషణ్‌కాలనీలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రెండు గుడిసెలు కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ భాదితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారని అన్నారు. బాధితులను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి భాదితులకు నిత్యవసరాలను పంపిణీ చేశారు. భాదితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్ గౌడ్, నాగ మద్దిలెట్టి,భూపాల్ రెడ్డి, కష్ణ రెడ్డి,హుస్సేన్ ఆలం తదితరులు పాల్గొన్నారు.



కాలం చెల్లిన ప్రభుత్వ వాహనాలకు వేలం

డిఎంహెచ్ఒ డాక్టర్ బి రామగిడ్డయ్య

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కాలం చెల్లిన ప్రభుత్వ వాహనాలను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రామగుండయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి చాంబర్‌లో కాలపరిమితి దాటిన వాహనాలను వేలం వేసేందుకు ప్రభుత్వ వాహనాల కమిటి సమావేశం నిర్వహించిందన్నారు. డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని కాలపరిమితి దాటిన 23 వాహనాలను ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా విధివిధానాలను రూపొందించి వాహనాలను ఈ వేలం కొనుగోలు పోర్టల్ ద్వారా నిర్వహించుటకు తీర్మానం చేశామన్నారు. మొత్తం వాహనాలను రెండు సమూహాలుగా విభజించి జనవరి నెలలో ఈ వేలం పాట నిర్వహిస్తామని అన్నారు. దీనికి గుర్తింపు పొందిన పాటదారులు కనీస రుసుం జమచేసి ఈ-వేలం పాట ద్వారా పాల్గొనవచ్చని తెలిపారు. నిబంధనలు, షరతులు అన్ని కూడా చట్ట ప్రకారం వర్తిస్తాయని అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి నిర్ణయాధికారం జిల్లా వైద్యశాఖ అధికారిపరిధిలో ఉంటుందన్నారు. పరిపాలన అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.సునీల్ కుమార్, డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ ఎపిఎస్ఆర్‌టిసి రజియ సుల్తాన్, అసిస్టెంట్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ సివి. రఘునాథ్ వర్మ, సర్వీస్, ఇంజనీర్ తారామోహన్ రావు పాల్గొన్నారు.

నారాయణ లో ముందస్తు క్రిస్మస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



నగరంలోని స్థానిక మాధవ్ నగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్వర్యంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు రేవరెండ్ బ్రదర్ మనోజ్ ముఖ్య అతిథిగా హాజరై పండుగ ప్రాముఖ్యతను వివరించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని వేదికపై క్యాండిల్ వెలిగించి, స్టూడెంట్స్, టీచర్స్ శుభాకాక్షలు తెలుపుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ అమీనా, ముంతాజ్ బేగం, రాధ పాల్గొన్నారు.

డ్రెస్ సర్కిల్లో కని విని ఎరుగని ఆఫర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలోని డ్రెస్ సర్కిల్ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి సెలబ్రేషన్స్ సందర్భంగా అన్ని రకాల వస్త్రాలపై స్పెషల్ డిస్కౌంట్స్ ప్రారంభమయ్యాయని సేల్స్ మేనేజర్ తెలిపారు. ప్రతిరోజు లక్కీ డ్రా లో ఇద్దరికీ ఎంత కొంటే అంత క్యాష్ బ్యాక్ పొందే అవకాశం ఉందన్నారు. సెలెక్టెడ్ ఐటమ్స్ పై వన్ ప్లస్ వన్ ఆఫర్లు అన్ని రకాల వస్త్రాలపై 20 నుంచి 50శాతం స్పెషల్ డిస్కౌంట్ ఉందని చెప్పారు. ప్రీమియం మెన్స్ వేర్ బ్రాండ్స్ పై 50శాతం వరకు స్పెషల్ డిస్కౌంట్ మెన్స్ ఎత్నిక్ వేర్, పార్టీవేర్ షర్ట్స్ టు పీసెస్ 1600. అన్ని రకాల మెన్స్ లీడింగ్ బ్రాండ్స్ అందుబాటులో కలవు వెడ్డింగ్ కలెక్షన్స్, పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు ,బ్రైడల్ గాగ్రాస్ ,చుడీదార్స్ ,డ్రెస్ మెటీరియల్స్, వెస్ట్రన్ వేర్ ,కిడ్స్ వేర్ ,జస్ట్ బార్న్, మెన్స్ వేర్, ఎత్నిక్ వేర్ అందుబాటులో వున్నాయి.

జగన్‌ది పాలన జనరంజక పాలన : కాటసాని

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాలన జనరంజకంగా కొన సాగుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, ఎంపిపి శారదా, గ్రామ సర్పంచి లక్ష్మన్న, ఎంపిటిసి సోమన్న, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కల్లూరు సింగిల్‌విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి, సల్కాపురం సర్పంచి మద్దిలేటి, మార్కాపురం సర్పంచి గ్రామదిలేటి వైసిపి నాయకులు కె.పెద్ద ఈశ్వరయ్య, నారాయణ, ఉప సర్పంచి శ్రీరాములు, శేఖర్, వెంకటేశ్వరమ్మ, మురళి, బోయ వెంకటేశ్వర్లు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఎండిఒ రమణమూర్తి తహశీల్దార్ రమేష్ బాబు, ఉలిందకొండ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాలు అందించాలి: మేయర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినియోగదారులు ఆరోగ్యవంతంగా ఉండేలా పాల డైరీలు నాణ్యమైన పాలు అందించాలని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సి.క్యాంపు సెంటర్‌లో నూతన సంగం పాల డైరీని బివై. రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెంపొందిస్తూ పాడి రైతుల అభ్యున్నతికి నిరంతం కృషి చేస్తున్న సంగం పాల సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్రిష్ణకాంత్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్ అధినేత ఎంవి. సుబ్బయ్య, సిఎంఒ జిల్లా కో ఆర్డినేటర్లు శ్రీకాంత్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సంగం డెయిరీని యూనిట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ బివై.రామయ్య



నిందితుడిని మీడియాకు చూపుత్ను పోలీసులు

బాబాయ్‌ని చంపిన అబ్బాయ అరెస్ట్

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి ఎస్‌సి కాలనీలో ఈ నెల 20న బాబాయ్‌ని చంపిన అబ్బాయిన పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు వెల్దుర్తి సిఐ యుగందర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాటల్లో.....వెల్దుర్తి ఎరుకలి సురేంద్ర (38)ను ఆయన అన్న కొడుకు ఎరుకలి రాజేంద్ర గొడ్డలితో వారి ఇంటిలోనే నరికి చంపిన విషయం తెలిసిందే. క్రైమ్ నెంబర్ 312/2022 కింద కేసు నమోదు చేసిన విచారణ చేపట్టారు. నిందితుడిని వెతికేందుకు రెండు టీంలు ఏర్పాటు చేసి, శుక్రవారం అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరచారు. ఈ హత్య చేయడానికి ప్రధాన కారణం చనిపోయిన సురేంద్ర వాళ్లకు , రాజేంద్ర వాళ్లకు ప్రక్కలో గల ఇంటి సమస్య గురించి రాజేంద్ర చెల్లెలు వాళ్లకు సురేంద్ర రెండు పందులను బాలుకు ఇచ్చారు. వాటిని కోసుకుని తిన్నారు. ఆ విషయం తెలిసి పందులకు సరిపడా డబ్బులు అయినా ఇవ్వమని సురేంద్ర అడిగాడు. డబ్బులు ఇవ్వడం లేదని సురేంద్ర చాలా రోజుల నుండి గొడవ పడుతూ వచ్చాడు. ఇటీవల రాజేంద్ర చెల్లెలు డెలివరీ కోసం పుట్టింటికి వచ్చింది ఆ సమయంలో సురేంద్ర ఈనెల 20న మద్యం తాగి వాళ్ళ ఇంటిలోకి వెళ్లి ఆ పందులకు సరిపడా డబ్బులు ఇవ్వాలని లేకపోతే గొడ్డలితో నరికి చంపుతానని భయపెట్టాడు. ఆమె భయపడి వాళ్ళ అన్న అయినా రాజేంద్రకు చెప్పారు. రాజేంద్ర కోపంతో ఆవేశంతో ఇంటికి వచ్చాడు. సురేంద్ర తో గొడవ పెట్టుకుని ఎందుకు పదేపదే హింసిస్తూ భయపెడుతున్నావు. నిన్ను చంపితే కానీ మాకు మనశ్శాంతి ఉండదు అని ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొని సురేంద్ర మెడపై నాలుగు సార్లు నరకాడు. అతడు అక్కడికక్కడే మరణించాడు. నిందితు హత్యకు వాడిన గొడ్డలిని పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద కళాకారులకు అండదండలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



ప్రతిభావంతులైన పేదకళాకారులకు టిజివి కళా క్షేత్రం అండదండగా నిలుస్తుందని చైర్మన్ టిజి భరత్ తెలిపారు. ఇటీవల వంరణించిన సీనియర్ నృత్యకళాకారుడు డ్యాన్స్‌మాస్టర్ ఉమాశంకర్ కుటుం బానికి ఆయన టిజివి కళాక్షేత్రం తరపున రూ. 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాన్ని కర్నూలులో ప్రవేశ పెట్టిన మొదటి గురువు ఉమా శంకరని అన్నారు. మరణించేంతవరకు ఆయనకు టిజివి కళాక్షేత్రం పెన్షన్ అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కళా క్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కర్నూలులో వున్న నృత్యగురువుల్లో అనేక మంది ఆయన శిష్యలేనని అన్నారు. వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తమసంస్థ వంటి కళాకారులకు ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు.

మహిళమార్ట్ సేల్స్ పెంచాలి

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు లోని మహిళ మార్ట్ సేల్స్ పెంచాలని డిఆర్‌డిఎ పిడి వేంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని సమాఖ్యలో విఒఎల సమీక్ష సమావేశంలో పాల్గొని విఒ లకు ఆదేశాలిచ్చారు. చేయూత మహిళమార్ట్ సేల్స్ పెంచడంలో ప్రతి ఎస్ఎస్‌జి మెంబర్లకు అవహగాహనా కల్పించాలని కోరారు. శ్రీనిధి రికవరీ సంఘాలు బలోపేతం చేయాలని సంఘాలన్ని, ఏ గ్రేడ్‌లో ఉండేటట్లు చేయాలని విఒలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి శ్రీ శ్రీధర్ రావు,ఎపిఎం పుష్పవతి,మండల సమాఖ్య ఒబిలు, సిసి లు పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్ఐ, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగాల పోరాట సమితి పోరాటల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు వయోపరిమితిని రెండేళ్ల పెంచుతున్నట్లు ప్రకటించడంతో డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ కానిస్టేబుల్ నోటిఫికేషన్ పైన స్పందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఇది నిరుద్యోగుల పోరాట ఫలితమే అని శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే కర్నూల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున వయోపరిమితిని పరీక్ష గడువును పోస్టుల సంఖ్యను పెంచాలని కోరుతూ నిరసనకు దిగారని తెలిపారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వయోపరిమితి రెండేళ్ల పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో గత నాలేగేళ్లుగా నోటిఫికేషన్లు లేకపోవడం అంతకంటే ముందు కూడా చాలా తక్కువ ఉద్యోగాలే భర్తీ కావడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు ఇంకా వయసు సరిపోదునే కారణంతో ప్రస్తుతం నోటిఫికేషన్‌కు దూరం అవుతారని, కావున వారందరిని దృష్టిలో పెట్టుకొని ఇంకో మూడేళ్ల వయో పరిమితి పెంచాలని, భారీ సిలబస్ ఉండి చాలా తక్కువ సమయం పరీక్షకు ఉంది కాబట్టి తక్షణమే పరీక్ష గడువును కనీసం 3 నెలలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని ఈ నోటిఫికేషన్ లోనే పోస్టుల సంఖ్యను 20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎఆర్ , జైలు వార్డెన్, ఫారెస్ట్ ఫైర్ తదితర పోస్టులను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భారీగా ఉన్న లక్షలాది నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే పోస్టుల సంఖ్యను పరీక్ష గడువును పెంచాలని ఇతర పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.



శ్రీసాయికృష్ణడిగ్రీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

సాయికృష్ణ డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో తృతీయ విద్యా సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థి రాజ్ కుమార్ మృతికి కళాశాల యాజమాన్యం కారణమని విద్యార్థి సంఘాల నేతలు వీరేష్ యాదవ్ , మహేంద్ర, నాగన్న, రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేయాలని రాయలసీమ యూనివర్సిటీ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎస్ఒ, పిడిఎస్‌యు, ఆర్‌విఎఫ్, డిపిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థి రాజకుమార్ అన్నమానస్పద మృతి చెందలేదన్నారు. పోలీసులు , రాయలసీమ యూనివర్సిటీ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కులమతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు

టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



క్రిస్మస్ వేడుకల్లో టిజిభరత్ , కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

కులమతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని వడ్డెగేరిలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థన చేశారు. తర్వాత కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. టిజి.భరత్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటేనే ఓ ప్రత్యేకమైన సెలబ్రేషన్ అన్నారు. కులం, మతం తేడా లేకుండా అందరినీ కలుపుకొని ఆదరించడం తమ కుటుంబానికి ఇష్టమన్నారు. కార్యక్రమంలో హిందూవులు, ముస్లింలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం హర్షంచదగ్గ విషయమన్నారు. కర్నూలు ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు తమ కుటుంబం ముందు వరుసలో ఉంటుందన్నారు. కోట్ల మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవడం కర్నూలు ప్రజలకు ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలకు సేవ చేయడమే కోట్ల, టిజి కుటుంబాలకు ముఖ్యమన్నారు. ప్రజలందరూ క్రిస్మస్‌ను వైభవంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఈశ్వర్, మెహబూబ్ ఖాన్, చిన్నపెంచులయ్య, తిమోతీ, నాగేశేషులు, విజేత, పాస్టర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌బిసి ఎఇ ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా పరిధిలోని శ్రీశైలం రైట్‌బ్యాంకు కెనాల్ (ఎస్ఆర్‌బిసి) ఎఇగా పనిచేస్తున్న మానిపాటి చంద్రుడు ఇంట్లో ఎసిబి అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచారంతో ఆయన ఇంటితో పాటు కోయిలకుంట్లలోని చంద్రుడు బంధువులు, సోదరుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించి రూ.2.52 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారని అధికారులు గుర్తించారు. ఇందులో ఎనిమిది ప్లాట్లు, రెండు ఇళ్లు, పదెకరాల భూమి, ఎనిమిది తులాల బంగారం గుర్తించారు.



సోదాలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

వ్యాపారుల మోసాలను అరికట్టవచ్చు

డిఎస్ఒ రాజా రఘువీర్

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న డిఎస్ఒ రాజా రఘువీర్

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన ఉంటే వ్యాపారుల మోసాలను అరికట్టవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ అన్నారు. శుక్రవారం నగరంలో పలు విద్యాసంస్థల్లో జాతీయ వినియోగదారుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగాయి. ఆయా కళాశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు.

సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో : కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల వారోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎస్ఒ రాజా రఘువీర్ తో పాటు వినియోగదారుల సమాచార కేంద్రం కార్యదర్శి శివ మోహన్ రెడ్డి, నారాయణరెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ పరమేశ్వర కుమార్ లు పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి వెంకట కృష్ణయ్య, అధ్యాపకులు ఎల్లా కష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో: ప్రభుత్వ పురుషుల డిగ్రీ, కళాశాల కామర్స్ విభాగం అధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు . ప్రిన్సిపల్ డాక్టర్ పి.కళావతి అధ్యక్షతన కెవిఆర్. కళాశాల కామర్స్ విభాగాధిపతి వి.శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు సాధారణ పౌరులకు వినియోగదారుల హక్కుల గూర్చే డెండి జాగ్రుతపరచాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, విద్యార్థులు జాగ్రత్తగా మసలుకోవాలని హెచ్చరించారు. కామర్స్ అధ్యాపకులు మెహర్ జహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వినియోగదారుల హక్కులపై విద్యారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలోవైస్ ప్రిన్సిపాల్ ఎ. సత్యనారాయణ, అధ్యాపకులు ఆర్. ఆదినారాయణ రెడ్డి వివి.రమణారెడ్డి, మస్తానీ, ప్రసంగించారు.

కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో: కెవిఆర్ మహిళా కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం వారు జిల్లాస్థాయిలో నిర్వహించిన, ప్లకార్డ్, సెమినార్, క్విజ్, పోస్టర్ ప్రసేంటేషాన్‌లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వినియోగదారుల చట్టం 2019 వినియోగదారుల హక్కులు, వినియోగదారుల భాద్యతలు గురించి వివరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్దులకు, ప్రధమ బహుమతి మరియు ద్వితీయ బహుమతులు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి, డాక్టర్ కె.వీరాచారి, జిల్లా ఫోరం సభ్యులు నారాయణ రెడ్డి, నాజియ కౌసర్, లీగల్ మెట్రలాజి ఇన్‌స్పెక్టర్ పరమేష్ కుమార్, హరిత తేజ అందజేసారు.



మాట్లాడుతున్న కెవిఆర్ ప్రన్సిపల్ ఇందిరాశాంతి



విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే శ్రీదేవికి ఎఐఎస్ఎఫ్ వినతి

ప్రజాశక్తి- మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర బాలుర పాఠశాల మరియు బాలికల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం పత్తికొండ శాసన సభ్యురాలు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ బాలుర పాఠశాల దగ్గర ఉన్న రామ్ నగర్ కాలనీ నుండి పాఠశాల దగ్గర నిలువ ఉన్న మురుగు నీరు నిలువ లేకుండ విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చక్కగా చదువుకోవడానికి వీలు కలిగించాలని, బాలికల పాఠశాల మరియు బిసి వసతి గహం దగ్గర ఉన్న చెత్త కుండీ యందు వ్యర్థాలు, కుళ్ళిన పదార్థాలు, మరియు జంతువులు మరణించినటువంటి ఖలేబరాలను వేస్తున్నారు. దుర్వాసన వలన పిల్లలు చదువుపై దష్టి పెట్టలేక పోతావున్నారు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు పడుతున్న సమస్యలను వెంటనే యుద్ధప్రతిపాదకన పరిష్కరించగలరని ఎమ్మెల్యే ను కోరామన్నారు.

పంచాయితీ స్థలాలు కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన ఈశ్వర్ దేవాలయ బావిని అధికార పార్టీకి చెందిన బడా వ్యక్తి స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కడుతున్నాడని స్థానిక ప్రజలు శుక్రవారం మద్దికెర లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి అర్జీ రూపంలో సమస్యను వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఇందులో నారాయణ, లక్ష్మన్న, పరమేశు, డాక్టర్ వీరేశ్, తిరుమలేష్, నరసింహ, నరేంద్ర, అయ్యన్న తదితర ప్రజలు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పత్తికొండ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని సాధిస్తాయని ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా, పత్తికొండ పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ వారి సహకారంతో పత్తికొండ యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని తెలిపారు. కర్నూలు ఎన్‌వైకెఎస్ వారి సహకారంతో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర రెడ్డి, లాలుస్వామి, పిఇటి మక్దుమ్, క్రీడాకారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న శ్రీశైలం ఇఒ లవన్న

అందరికి అందని ట్యాబ్‌లు

- జిల్లాలో 19029 మంది 8వ తరగతి విద్యార్థులు
- అందుబాటులో ఐదు వేల ట్యాబ్‌లు మాత్రమే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాఠశాలలో డిజిటల్ విప్లవాన్ని తీసుకొస్తామంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లాకు కేవలం ఐదు వేల ట్యాబ్‌లనే ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 19029 మంది, టీచర్లు 1824 మంది ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు. అయితే కేవలం ప్రభుత్వ సెక్టార్ల చదివే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ ట్యాబులు ఇచ్చి, ప్రైవేట్ సెక్టార్‌లో చదువుతున్న విద్యార్థులకు మొండి చేయి చూపించింది. జగనన్న అమ్మఒడి ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల కింద చదువుతున్న విద్యార్థులకు అందించారు. ట్యాబుల విషయానికొస్తే ప్రభుత్వ యాజమాన్యం కింద చదివే విద్యార్థులకు మాత్రమే ఇచ్చి ప్రైవేట్ చట్టాల చదువుతున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మొండిచేయి చూపిందని ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంపై విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. అది కూడా ప్రభుత్వ యాజమాన్య కింద 19,029 మంది పైన విద్యార్థులు ఉండగా కేవలం 5000 మందికి మాత్రమే ప్రస్తుతం పంచడానికి ట్యాబులు సిద్ధంగా ఉన్నాయి. ఇంకా 14,029 ట్యాబులు జిల్లాకు రావాల్సి ఉంది. అందులో కూడా మండలానికి 180 ట్యాబ్‌లు మాత్రమే విద్యార్థులకు ఇవ్వనున్నారు. జగనన్నకు పేద విద్యార్థుల పైన ప్రేమ ఉన్నట్లు లేక బైజుస్‌పై ఉన్న ప్రేమ నా? అని తల్లిదండ్రుల్లో చర్చ జరుగుతుంది.



రాష్ట్రపతి పర్యటన విజయవంతం చేయాలి

- శ్రీశైలం ఇఒ లవన్న

ప్రజాశక్తి-శ్రీశైలం

ఈ నెల 26న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శ్రీశైలం సందర్శించే కార్యక్రమాన్ని అన్ని విభాగాధిపతులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న సూచించారు. శుక్రవారం పరిపాలన భవనం సమావేశంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటన సందర్భంగా గంగాధర మండపం, ఆలయం, గంగాసదన్ ఎదురుగా ఉన్న పర్యాటక సంస్థ యాత్రికా సదుపాయకేంద్రం మొదలైన చోట్ల సిబ్బందికి క్షేత్ర పరిధిలో ప్రత్యేక డ్యూటీలు కేటాయించాలని అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. దేవస్థానం పరిధిలో రోడ్లు గుంతలుగా ఉండకుండా చూడాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. విద్యుత్‌లో అంతరాయం ఏర్పడకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటనకు వచ్చే జిల్లా అధికారులకు వసతి విభాగంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వసతి విభాగపు ఎఇఒను ఆదేశించారు. రాష్ట్రపతికి దర్శనం విషయం లో ఆలయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆలయ విభాగాన్ని ఆదేశించారు. ఆలయ విభాగంలో ఎప్పటి లాగానే పుష్పాలంకరణ చేయాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ లు , పర్యవేక్షకులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో భార్యాభర్తలు గల్లంతు



గల్లంతైన భార్యభర్తల కుటుంబ (ఫైల్)

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని జూటూరు గ్రామం వద్ద కేసీ కెనాల్‌లో భార్యాభర్తలు గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన నరసింహ చారి (30) కు నందికొట్కూరు పట్టణానికి చెందిన సుమిత్ర(27)తో 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలంగా సుమిత్ర అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్సలు చేయించిన ఫలితం లేదు. దీంతో ఇరుగుపొరుగువారు తెలిపిన సూచన మేరకు జూపాడు బంగ్లా మండలం సిద్దేశ్వరం గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్దకు వచ్చి పూజలు చేశారు. స్నానం చేసి దుస్తులు మార్చుకొని ఇంటికి వెళ్లాలని సూచించడంతో జూటూరు గ్రామ సమీపంలో కేసీ కెనాల్‌లో దిగారు సుమిత్ర ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడడంతో కాపాడేందుకు భర్త నరసింహాచారి వెళ్లి ఇద్దరు గల్లంతయ్యారు. వీరితో పాటు వచ్చిన బంధువులు వీరి రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఎంతకీ రాకపోవడంతో కెనాల్ వెంట వచ్చారు కాగా మెట్ల వద్ద ఉంచిన బైకును గుర్తించి ఎటు వెళ్లారని గాలించారు. అప్పటికే కేసీ కెనాల్‌లో మునిగి పోయారని గ్రహించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. నరసింహ ఆచారి సుమిత్రకు కూతురు, కొడుకు ఉన్నారు. నరసింహ చారి అగ్రికల్చర్ ప్రైవేట్ కంపెనీలో చేస్తున్నాడు.



బిఎఫ్-7 పట్ల భయాందోళనలు వద్దు

- కోవిడ్ నిబంధనలు పాటించాలి
- జిల్లాలో ఎలాంటి కరోనా కేసులు లేవు
- ప్రతి పిహెచ్‌సిలో కరోనా టెస్టులు
- డిఎంహెచ్‌ఓ డాక్టర్ వి. వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి కరోనా కేసు నమోదు కాలేదని, కోవిడ్ కొత్త వేరియంట్ ఓమిక్రాన్ బిఎఫ్-7 విజృంభిస్తుందన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.వెంకట రమణ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కొత్త వేరియంట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి పిహెచ్‌సిలో రాపిడ్ టెస్టులు చేస్తామని పాజిటివ్ వస్తే ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తామని అందులో పాజిటివ్ వస్తే విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో ఉన్న జినాల్ ల్యాబ్‌కు పంపుతామ న్నారు. అక్కడ ఏ రకమైన వేరియంట్ డిక్లేర్ చేస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త వేరియంటు పట్ల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని కోవిడ్ జాగ్రత్తలు పాటించాలని అన్నారు. 60 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ బూస్టర్ డోస్ వేయించుకోవాలని తెలిపారు. చలి ఎక్కువగా ఉందని సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని డిఎంహెచ్‌ఓ సూచించారు. ఎక్కువగా పిల్లలకు జలుబు, జ్వరం వంటి సీజనల్ వ్యాధులు వస్తున్నాయని సరైన సమయంలో వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని ఆయన తెలిపారు.

ఐక్య ఉద్యమాలు అవసరం

- జిల్లా మహాసభలను జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి

ప్రజాశక్తి - నంద్యాల

పాలకుల కార్మక వ్యతిరేక విధానాలను నిరిస్తూ ఐక్య ఉద్యఉద్యమాలకు కార్మికులను సిద్ధం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి సూచించారు. సిఐటియు నంద్యాల జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యాలయం టి.నరసింహయ్య భవనంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అధ్యక్షతన నిర్వహంచారు. కె.ధనలక్ష్మి , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడారు. ఉద్యోగ కార్మిక వర్గాల పోరాటాలకు అండగా నిలుస్తున్న సిఐటియు జిల్లా రెండవ మహాసభలు నంద్యాల పట్టణంలో ఈనెల 27,28 తేదీల్లో జరుగుతున్నాయన్నారు. నంద్యాల పట్టణంలో 27న జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగులు నంద్యాల పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల సబ్సిడీ రుణాలు ఇస్తుందని, మరుసటి సంవత్సరమే ఆ రుణాలను రద్దు చేస్తూ మరోవైపు ఆ భారాలను సామాన్యులపై మోపుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాల వల్లే దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. వైద్య, విద్యరంగాల ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్నారన్నారు. కేంద్ర బిజెపి అధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమాలు చేయాలన్నారు. 44 కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడలను తీసుకొచ్చి కోట్లాదిమంది కార్మికులకు తీవ్ర అన్యాయం చేసింద న్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి వాగ్దానం చేసి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు తీసివేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోస్తుందన్నారు. స్కీం వర్కర్లకు ఆశ అంగన్వాడి విఒఎ, విఆర్ఎ స్వచ్ఛభారత్ కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలన్నారు. హమాలీ ఆటో, భవన నిర్మాణ హమాలి కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎల్లయ్య, కెఎండి.గౌస్, నిర్మలమ్మ, రణధీర్, శ్రీనివాసులు, తోట మద్దులు, భాస్కర్ రెడ్డి, సుబ్బయ్య, షేఖారాణి, బాల వెంకట్, లక్ష్మణ్, రమణకుమారి, నాగమణి, నాగేశ్వరరావు, బాలయ్య, తిరుపతయ్య జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి

ధర్మారెడ్డికి మంచు మనోజ్ పరామర్శ

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

తితిదే ఈవో ఏవీ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి (28) ఆకస్మిక మరణం చెందడంతో సినీ నటుడు మంచు మోహన్ బాబు కుమారుడు మంచు మనోజ్ పరామర్శిం చారు. చంద్రమైళిరెడ్డి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య గురువారం ముగిశాయి. జూపాడుబంగ్లా మండలం లోని ధర్మారెడ్డి స్వగ్రామమైన పారుమంచాలకు పలువురు ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. శుక్రవారం మంచు మనోజ్ పారుమంచాల గ్రామంలోని ధర్మారెడ్డి ఇంటికి చేరుకుని చంద్రమౌళిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మారెడ్డిని మనోజ్ ఓదార్చి ధైర్యం చెప్పారు. జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులను పరామర్శిం చారు. కాగా, ఈనెల 18న చెన్నైలో పెళ్లిపత్రికలు పంచే క్రమంలో కారులో వెళుతూ చంద్రమౌళిరెడ్డి గుండెపోటుకు గురయ్యారు. కావేరి ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందిన సంగతి తెలిసిందే.



ధర్మారెడ్డిని పరామర్శిస్తున్న మంచు మనోజ్

తెలుగు రచయితల సభల్లో నంద్యాల కవులు

ప్రజాశక్తి - నంద్యాల

ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన ఐదవ తెలుగు రచయితల మహాసభల్లో వివిధ తెలుగు భాషా సాహితీ కార్యక్రమాల్లో పాల్గొని నంద్యాల కవులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కవి సమ్మేళనంలో తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి,కవి నీలకంఠమాచారి తెలుగు భాషా వైభవాన్ని తమ కవితల ద్వారా చాటగా కవులు నరేంద్ర,కొప్పుల ప్రసాద్ ,మాబు భాష, శేష ఫణి వివిధ సామాజిక సమస్యలపై తమ గళాన్ని వినిపించి తమ ప్రతిభ చాటారు. రచయితల సమావేశాల్లో ప్రతినిధులుగా పాల్గొని సాహితీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న నంద్యాల రచయితలను కవులను శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అభినందించి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్య సృష్టిలో భాష ప్రధాన పాత్ర వహిస్తుందని , రచయిత భాష ద్వారా తన భావాలను ఆలోచనలను ఆదర్శాలను లోకానికి పంచి జన జాగృతికి దోహదపడాలన్నారు. నేటి తరంలో భాష పట్ల అనురక్తి కలిగేలా సాహిత్య కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తూ భాషా వైభవానికి కృషి చేయాలని కోరారు. భాషను కోల్పోతే భావాలను పంచే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. రచయితలు తమ రచనలు సామాజిక ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. తెలుగు రచయిత సభల్లో పాల్గొన్న నంద్యాల కవులను మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ దీవి హయగ్రీవాచారి, సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు అభినందించారు.



జ్ఞాపికలు అందుకుంటున్న నంద్యాల కవులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు

కోటకందుకూరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోటకందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంపుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ త్రో బాల్ పోటీలలో మహేంద్ర, సోమనాథ్ రెడ్డి, వాసంతి, ఫయాజున్ , తులసీలు మంచి ప్రతిభ కనబరచారన్నారు. వీరు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయస్థాయి త్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రవి ఉపాధ్యాయులు రమాబాయి, కన్నయ్య, కృష్ణవేణి, ప్రసాద్ రెడ్డి, దీన, నాగభూషణ్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జయ భారతి, హసీనా తదితరులు అభినందించారు.

ఖోఖో జట్టుకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆత్మకూర్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఖోఖో క్రీడా జట్టుకు క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు పువ్వాడి భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్స్ ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్ప చక్రపాణి రెడ్డి వారి కుమారుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షణీయం అన్నారు. జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. కర్నూలు జిల్లాఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. ప్రభాకర్ మాట్లాడుతూ బాలికల జట్టు 26 వ తేదీ నుండి 30 వరకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాక్షించారు. ఆత్మకూర్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పి దేవానంద్, ఎస్ శంకర్, సుదర్శన్ రావు, చంద్రశేఖర్, నరసింహ, మల్లికార్జున నాయక్, కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి కే కలీల అహ్మద్, క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడాకారులతో ప్రజా ప్రతినిధులు వీఐటీలు

మాజీ ఎమ్మెల్యే బీసీ సోదరుడు మృతి

- నివాళులర్పించిన ప్రముఖులు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సోదరుడు టిడిపి సీనియర్ నాయకులు బీసీ బాల తిమ్మారెడ్డి(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బీసీ బాల తిమ్మారెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం కర్నూలు కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఈనెల 22వ తేదీ రాత్రి 10 గంటలకు వైద్యశాలలో మృతి చెందారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి నివాసం వద్ద బీసీ బాల తిమ్మారెడ్డి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, టిడిపి కర్నూల్, నంద్యాల జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిజ్జం పార్థసారథి రెడ్డి, ఎస్ వి మోహన్ రెడ్డి, అవుకు జెడ్పిటిసి సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, కాటసాని రామ కాంత్ రెడ్డి,టిడిపి యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, టిడిపి నాయకులు ఐవి పక్క రెడ్డి, సిపిఎం పార్టీ నాయకులు సుధాకర్, నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి బాల తిమ్మారెడ్డి భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సోదరులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి, బిసి రామనాథరెడ్డిలకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అసత్తి నాయనాల మధ్య బాల తిమ్మారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. బనగానపల్లెలో విషాద ఛాయలు అలముకున్నాయి.



బాల తిమ్మారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిసి జనార్ధర్ రెడ్డి, తదితరులు



పాడేను మోస్తున్న బిసి జనార్ధర్ రెడ్డి



కేక్ కట్ చేస్తున్న కాటసాని నరసింహారెడ్డి అభిమానులు

ఘనంగా కాటసాని నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

వైసిపి నాయకులు కాటసాని చంద్రశేఖర్ రెడ్డి నివాసంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కుమారుడు కాటసాని నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోనే వైసిపి నాయకులు దేవేంద్ర ఆచారి, వై వెంకటసుబ్బయ్య యాదవ్, కొమ్ము కిరణ్, ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర, ఉమ్మడి అంకన్న యాదవ్, భాస్కర్, బాలుడు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నాబార్డ్ డీడీ ఎంఏ పార్థవ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

శిక్షణలో నేర్చుకున్న కలలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే నాబార్డ్ లక్ష్యం అని నాబార్డ్ డీడీఎంఏ పార్థవ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో నాబార్డు సహకారంతో సత్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఫ్యాబ్రిక్, పెయింటింగ్, కలంకారిలో ఈనెల 8 నుండి 22వ తేదీ వరకు 15 రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఫ్యాబ్రిక్, పెయింటింగ్, కలంకారి లో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం నాబార్డ్ డిడిఎం పార్థవ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులపాటు శిక్షణలో నేర్చుకున్న ఫ్యాబ్రిక్, పెయింటింగ్, కలంకారి లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎల్డీసీఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్యాబ్రిక్, పెయింటింగ్, కలంకారిలను నేర్చుకొని స్వయం ఉపాధి పొందే మహిళలకు బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. అయా బ్యాంకులలో అకౌంట్ లు కలిగిన మహిళలు బ్యాంకు అధికారులను కలిసి రుణాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పద్మావతి, అసిస్టెంట్ ట్రైనర్ లక్ష్మీదేవి, సత్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్న దృశ్యం



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

డిస్కస్ త్రోలో కెవి సుబ్బారెడ్డి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కె.వి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థి హరీష్ కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈనెల 22న నిర్వహించిన అథ్లెటిక్స్ డిస్కస్ త్రో విభాగంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించారని కె.వి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న హరీష్ అథ్లెటిక్స్ డిస్కస్ త్రో విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించారన్నారు. అలాగే షాట్ పుట్ లో హరీష్ మూడవ స్థానం సాధించాడన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డితో పాటు భూమా శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మహబూబ్ బాషా విద్యార్థి హరీష్‌ను అభినందించారు. రానున్న రోజుల్లో క్రీడల్లో రాణించి కళాశాలకు, ఆళ్లగడ్డ ప్రాంతానికి మంచి పేరు తీసుకొని రావాలని వారు ఆకాంక్షించారు.

చంద్రబాబుతో రాష్ట్రం అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి-ప్యాపిలి

రాష్ట్రం అభివద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబునే అని డోన్ నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఇదేమికర్మ మన రాష్టానికి కార్యక్రమం హుసేనాపురం వీధిలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలన పరిజ్ఞానం లేక రాష్ట్రాన్ని బస్ట్ పట్టిస్తున్నారన్నారు. కరెంటు బిల్లు 300 యూనిట్లు వస్తే రేషన్ కార్డు తీసేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు గౌతమ్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, మహేష్ బట్ , వెంకటేశ్వర రెడ్డి, రామ సుబ్బయ్య, సుంకయ్య, రామ్మోహన్ ఖాజాపీర్ సుదర్శన్ చల్లా వీర రామాంజనేయులు మల్లికార్జన అభిలాష్ రెడ్డి కోదండ రామయ్య పుల్లారెడ్డి, రామిరెడ్డి, బాలరంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

షేక్ ఇబ్రహీం మృతి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

షేక్. ఇబ్రహీం మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం ఫెడరేషన్, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. నంద్యాల పట్టణములోని గాంధీ చౌక్ నందు ముస్లిం ఫెడరేషన్, విద్యార్థి, యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నరసరావుపేటలో మసీదు విషయంలో హత్యకు గురైన షేక్. ఇబ్రహీం హత్యకు నిరసనగా శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్. రియాజ్,ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూత్ కన్వీనర్ సుహైల్ రానా,నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్,కో.కన్వీనర్ అత్తవుళ్ళ ఖాన్,గన్ని కరీం మాట్లాడుతూ గత మూడు రోజుల కింద నరసరావుపేటలో మసీదు విషయంలో హత్యకు గురైన షేక్. ఇబ్రహీం మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని, షేక్.ఇబ్రహీం మృతి కేసు వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్ట్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. షేక్. ఇబ్రహీం కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వక్ఫ్ బోర్డ్ భూములు అధిక శాతంలో అన్యాక్రాంతం అవుతున్నాయని, రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,బీసీలపైన దాడులు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహబూబ్ బాషా,మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్ల ఖాజా హుస్సేన్, ఎస్డీపిఐ జిల్లా ఉపాధ్యక్షులు కరిముల్ల,స్టూడెంట్ లీడర్ దివాకర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా మస్తాన్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి యువజన ప్రజా సంఘాలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత

ప్రజాశక్తి - రుద్రవరం

మొక్కలను నాటడంతో వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చునని ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో వ్యవసాయ అధికారులు శశికళ,సునీల్ ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వర రావు అధ్యక్షతన పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ అనీల్ కుమార్ మొక్కలు అన్ని ప్రతి మోడల్ పాఠశాలకి ఇవ్వాలని ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సతీష్,పి. డీ శ్రీనివాసులు, చవాన్, వసుంధర,వెంకట రమణ,అను రాధ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిటిసిలకు జీతాలు మంజూరు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల పరిధిలోని ఎంపీటీసీలకు ఐదు నెలల గౌరవ వేతనం మంజూరు అయిందని ఎంపీడీవో సుబ్బరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్‌లోని అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం జమ అయ్యిందన్నారు.

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత సంవత్సర కాలంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు, వారి బంధువులకు దాతల సహాయంతో అన్నదానం చేస్తున్నారు. అందులో భాగంగా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన శారదా శిల్పకళా మందిరం నిర్వాహకులు దురుగడ్డ రవీంద్ర ఆచారి, సావిత్రమ్మల కుమారుడు శేఖర్ ఆచారి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం దాదాపు 200 మంది రోగులకు,వారి దగ్గర ఉన్న బంధువులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గంగన్న అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశీభట్ల శివప్రసాద్, కార్యదర్శి బంగారు రాము యాదవ్ , ఉపాధ్యక్షుడు డా.గంగన్న, నిచ్చెన మెట్ల రామయ్య,సాయి, సభ్యులు పాల్గొన్నారు.

రబీ పంటలను నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం రబీలో సాగు చేసిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. రబీలో సాగు చేసిన రెండు కార్ల పంటలను స్థానిక రైతు భరోసా కేంద్రలలో నమోదు చేసుకోవాలన్నారు.



ముగిసిన బేస్ బాల్ క్రీడా శిక్షణ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు హెడ్మాస్టర్ మాచని సోమశేఖర్ పర్యవేక్షణలో జిల్లా బేస్ బాల్ అధ్యక్షులు రమణయ్య,ప్రత్యేక సలహాదారులు వై.వి.ఎస్.నారాయణరెడ్డి సంయుక్త వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ క్రీడా దుస్తులను అందించారు. ఆధ్వర్యంలో ఈనెల12వ తేదీన ప్రారంభమైన బేస్ బాల్ క్రీడా జాతీయ శిక్షణ శిబిరము శుక్రవారం ముగిసింది. శిక్షణ ముగించుకున్న క్రీడాకారులు ఈనెల 26వ తేదీ నుండి కేరళలో జరిగే జాతీయస్థాయి బేస్ బాల్ క్రీడా పోటీలలో పాల్గొని ప్రతిభను చాటడం జరుగుతుందని ముగింపు సభలో హెడ్మాస్టర్ సోమశేఖర్ తెలిపారు. శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు స్థానిక వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ క్రీడా దుస్తులను అందించారు. ఈ సందర్భంగా వై.వి.ఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రానికి చక్కటి పేరు తీసుకురావాలని జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబరుస్తూ పతకాల ద్వారా పేరు తీసుకురావాలని సూచించారు,శిక్షణ శిబిరానికి సహకరించిన డాక్టర్ చంద్రశేఖర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రీడాకారులకు 12 రోజులపాటు సీనియర్ క్రీడాకారులు శిక్షకులు. అబుబుకర్. హరి, జుబేర్. షాహిద్ శిక్షణను అందించారు. ఉపాధ్యాయులు చెన్నకేశవులు,సుమిత్ర, జ్యోతి, కుసుమకుమారి,సునీత,జయసుధ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

హ్యాండ్ వాష్ స్టేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో అర్బన్ హెల్త్ కేంద్రంలో హ్యాండ్ వాష్ స్టేషను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిసెఫ్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 50 మున్సిపాలిటీలలో హ్యాండ్ వాష్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఎంపిక చేసిన మున్సిపాలిటీలలో వీటిని ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుగొండ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ రంగస్వామి, మారుబోతుల విజయ్ శంకర్, షఫీ ఉల్లా, హరిప్రసాద్, నూర్జహాన్, పాణ్యం పార్వతి, సుంద రావు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, యునిసెఫ్ అధ్వర్యంలో హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ పి కిషోర్,మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ శివలీల, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్ ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ లు హమీద్ మియ్య, చాంద్ భాష, అబ్దుల్ రవూఫ్, మనపాడు అశోక్, యం.లక్ష్మిదేవి, నాయబ్ వార్డు ఇంచార్జ్ లు పి.రమేష్, రజిని కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, కురువ శ్రీను, మున్సిపల్ సిబ్బంది, మెప్మా టీఎంసీ శాంత కుమారి , యూనిసెఫ్ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ ఎన్ .ధరణి కుమారి అర్చన, వినయ్, కిషోర్ మెప్మా సిబ్బంది కమ్యూనిటీ ఆర్గనైజర్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు, సమాఖ్య అధ్యక్షులు, సంఘ సభ్యులు తదీతరులు పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్



హ్యాండ్ వాష్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ సుధాకర్ రెడ్డి

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిత్రేనిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అనంతరం హరి నగరం గ్రామంలో పాఠశాల నాడు- నేడు పనులను, హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన గుడ్డు ఆహార పదార్థాలను ఇవ్వాలన్నారు. నిర్మాణం పనులకు సంబంధించి వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి ఏపీవో ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్బన్న, వైసీపీ నాయకుడు నాగ ముని, సచివాలయ సిబ్బంది ఉన్నారు. **చాగలమర్రి :** సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపిడిఒ చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మల్లెవేముల, నేలంపాడు, పెద్దబోధనం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి వివిధ రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్‌లకు పలు సూచనలు చేశారు. నేలంపాడు సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, షాబియా, ఆయా సచివాలయాల సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.



నూతన భవన పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో



యోగాసానాలను తిలకిస్తున్న చైర్మన్ సుధాకర్ రెడ్డి

ఒత్తిడిని జయించే ఔషధం యోగ : చైర్మన్ సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఔషదంగా పనిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి జూనియర్ కాలేజ్ నందు నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా శాప్ లీగ్స్‌ను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ నంద్యాల జిల్లా చీఫ్ కోచ్ రాజు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి మంచికంటి అవినాష్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా శాప్ లీగ్స్ యోగా కో-ఆర్డినేటర్ భాధ్యతలు చేపట్టిన శ్రీమతి అంజనీ స్వప్న శుభాకాంక్షలు తెలిపుతూ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, నంద్యాల జిల్లా శాప్ కో-ఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్ , కర్నూలు జిల్లా శాప్ కో-ఆర్డినేటర్ పెరుమాళ్ళ శ్రీనాథ్ , జూడో అసోసియేషన్ సి.ఈ.ఓ బద్దుల శ్రీధర్ , కర్నూలు జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి , శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్,శ్లోక స్కూలు డైరెక్టర్ కవిత , బసిరెడ్డి డిగ్రీ కాలేజీ డైరెక్టర్లు, నాగ సత్యనారాయణ , సరళా దేవి, రమేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థుల చేసిన యోగాసనాలను వీక్షించారు. ఆనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించి ఛైర్మన్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, యోగా గురు, శ్యామలా గౌరీ, ఫిజికల్ డైరెక్టర్ లు పద్మలత,విజయకుమారి, వ్యాయమ ఉపాధ్యాయులు కల్యాణి, నాజ్మ , సుబ్బన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి : టిడిపి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

నంద్యాల జిల్లా పార్లమెంటు, మరియు డోన్ నియోజకవర్గం లలో తెలుగుదేశం పార్టీని గతంలో కంటే అభివృద్ధి చేస్తామని నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పిడతల రూబెన్, టిడిపి ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లొడ్డశేఖర్ అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు లొడ్డ శేఖర్ పిడతల రూబేనుకు సన్మాన సభ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మేకల నాగరాజు ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి రవీంద్ర నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రూబెన్, శేఖర్ మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీలను బీసీలకు గౌరవప్రదమైన స్థానాన్ని ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. రూబెన్, శేఖర్లను తెలుగుదేశం పార్టీ బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, కార్యకర్తలు శ్రీనివాసగౌడ్, టైలర్ రాముడు రవీంద్ర నాయక్ బిజ్జం నల్లారెడ్డి (ఆర్ఎస్ రంగాపురం), నాగరాజు తదితరులు శాలువాలు పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గూటం శివ, నంద్యాల మధు, కానాల అంజి, తదితరులు పాల్గొన్నారు.

27న ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఈనెల 27న ట్యాబులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో విజయకుమార్ రెడ్డి, ఎంఈఓ పక్రు నాయక్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ట్యాబులు పంపిణీ చేస్తారన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తపల్లి మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు బొల్లు ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులకు వినియోగదారుల హక్కుల గురించి, చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులు కాబట్టి ప్రతి వ్యక్తి వినియోగదారుడు కాబట్టి వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకొని చైతన్యం కావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పాంప్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న వికలాంగుల అధ్యక్షులు రౌఫ్

వికలాంగులను ఆదుకోండి

ప్రజాశక్తి - వెలుగోడు

వికలాంగులను ఆదుకోవాలని సహాయ సంచాలకులు వయోవృద్ధులు సహాయ సంస్థ నంద్యాల జిల్లా మేనేజరు విజయకు వెలుగోడు పట్టణ వికలాంగుల సేవా సంస్థ అధ్యక్షులు ఖతీబ్ రవూఫ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హులైన వికలాంగులకు అందజేస్తున్న రూ. 3 వేల పించనుతో జీవనం కొనసాగడం లేదని అన్నారు. నిత్యవసరాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని రూ. 6 వేల పింఛన్ అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్, సుంకమ్మ, నూరులమిన్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలతో జీవనోపాధిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - మిడుతూరు

బ్యాంకు రుణాలతో మహిళలు జీవనోపాధిని పెంచుకోవాలని ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్యా కార్యాలయంలో ఎపిఎం సుబ్బయ్య ఆధ్వర్యంలో నాగలూటి గ్రామానికి సంభందించిన పొదుపు మహిళలకు తొమ్మిది గ్రూపులకు రూ.1,56,50,000 మంజూరు చేసిన చెక్కును ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రుణాలతో కుటుంబ ఆదాయంతో పాటు పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. అనంతరం ఇండియన్ బ్యాంకు మేనేజర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సీసీలు కృష్ణారెడ్డి, శంకరయ్య,భాను, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక విక్టోరియా రీడింగ్ రూం ఆవరణలో నంద్యాల మెట్ట రైతుల సంఘం ఆధ్వర్యంలో, కరుణామయ విద్యాసంస్థల ఆవరణలో విద్యాసంస్థ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ 120 జన్మదిన సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి వ్యవసాయ రంగం కీలకం అని, దేశానికి రైతే వెన్నెముక అని భావించి చరణ్ సింగ్ ఆనాడే రైతుల కోసం ఉద్యమించారని అన్నారు. రైతాంగానికి ఆయన చేసిన సేవలు మరవలేమని దశరథరామిరెడ్డి అన్నారు. కరుణామయ గ్రూప్ సంస్థల అధినేత దండె దస్తగిరి, కొమ్మా శ్రీహరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరుణామయ గ్రూపు సంస్థల అధినేత దండె దస్తగిరి, నరేష్, ఏరువ రామచంద్రారెడ్డి, నంద్యాల మెట్ట రైతుల సంఘం నాయకులు కొమ్మా శ్రీహరి, చింతల నాగకుమార్, ఓజా సుబ్బయ్య, రామమురళి, నాగన్న, ఆదినారాయణ, కరీంబాష, పర్వేజ్, గోవర్ధన రెడ్డి, ముషార్రఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **శిరివెళ్ల :** ఆరుగాలం కష్టపడే అన్నదాతను జై కిసాన్ ఎరువులు పురుగుల మందులు లాభాల బాట పట్టిస్తున్నాయని సిరివెళ్ల జై కిసాన్ ప్రోడక్ట్ బ్రాంచ్ ఇంచార్జి మద్దిలేటి పేర్కొన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జై కిసాన్ కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జై కిసాన్ బ్రాంచ్ ఇంచార్జి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు నమ్మకానికి మారుపేరుగా జై కిసాన్ ఎరువులు పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనేక సంవత్సరాల నుండి నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు అన్నదాతలకు అందిస్తూ వారి సేవలో తరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, జై కిసాన్ సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి :** పట్టణంలో అంతర్జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు సల్లానాగరాజు ఆధ్వర్యంలో రైతులను సన్మానించారు. స్థానిక రాయలసీమ బీసీ సంక్షేమ కార్యాలయంలో రైతులు తిప్పల చిన్ననరసింహారెడ్డి, నూర్ బాష , రంగనాయకులు , బాలయ్య , సంటెన్నలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. దేశంలో రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న దృశ్యం



రైతులను సన్మానిస్తున్న సాగునీటి సాధన సమితి సభ్యులు సల్లానాగరాజు

వృద్ధులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఏబీ ఎంపాలెంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా నిమ్మకాయల రాజు టిడిపి ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో వృద్ధులకు శుక్రవారం చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ మహమ్మద్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మద్దిలేటి, ఐటీడీపీ అధ్యక్షులు ముర్తుజావలి, రషీద్ ఖాన్, నిమ్మకాయల మోహన్ టిడిపి నాయకులు వేణుగోపాల్ బీసీ సెల్ పట్టణ నాయకులు రాజన్న ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, కుమార్ తెలుగు యువత యూత్ లీడర్ రసూల్ ఖాన్ ప్రవీణ్ రగడ,టిడిపి యూత్ మాజీ కౌన్సిలర్ శాంతరాజు,నాగేంద్ర,పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

స్కాలర్స్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని సెమీ క్రిస్మస్ వేడుకలను స్కాలర్స్ స్కూల్ అధినేత కాలూరి శివప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు కాలూరి లక్ష్మీల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. నందికొట్కూరు వేళాంగిణి మాత చర్చి పాస్టర్ గారైన పాస్టర్ రెవరెండ్ కేడీ జోసఫ్ పాల్గొని ప్రార్థన చేశారు



క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

వీధిలైట్ల వితరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల పరిధిలోని పెద్ద భోదనం ఎస్సీ కాలనీకి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి 15 వీధిలైట్లను వితరణగా ఇచ్చినట్లు ఆయన వర్గీయులు శుక్రవారం యువ నాయ కులు రామనాథరెడ్డి, కావిడి ఓబయ్య, హరిచంద్రారెడ్డి టంగుటూరు అశోక్ తెలిపారు. ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక ఇక్కట్లు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకుని రావడంతో వెంటనే స్పందించి వీధిలైట్లు మంజూరు చేశారన్నారు. వీధిలైటను సొంత నిధులతో బిగించడం జరిగిందని వారు తెలిపారు.

సమగ్ర సస్యరక్షణతో కత్తెర పురుగు నివారణ

జూపాడుబంగ్లా: మొక్కజొన్న పైరును ఆశించే కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సస్య రక్షణ), కో - ఆర్డినేటర్ ఎ. రామకృష్ణా రావు సూచించారు. శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలో 80 బన్నూరు, ఆర్ కృష్ణారావుపేట, రామసముద్రం, తరిగొప్పుల, కృష్ణారావు పేట, తంగడంచ గ్రామాలలోని మొక్కజొన్న, మినుము పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటకు ఎక్కువగా కాండం తొలిచే పురుగు ఆశించి నష్టపరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డా. జీ. ప్రసాద్ బాబు, మండల వ్యవసాయ అధికారి కష్ణా రెడ్డి, రైతు భరోసా కేంద్రాల వి.ఏ.ఏలు పాల్గొన్నారు.



సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మోడల్ స్కూల్‌లో ఇంధన పొదుపు దినోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని రవ్వలకొండ మీద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఇంధనం పొదుపు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ విద్యుత్ ఆదా పై వివిధ పద్ధతులను విద్యార్థులు స్కిట్ల రూపంలో వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎ ఈ శ్రీనివాసులు ను పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ శ్రీనివాసులు

ఎగువ అహోబిలంలో తెలంగాణ విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలం పరిసర ప్రాంతాల్లో తెలంగాణ విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ద్వారా పరిశుభ్రం చేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన డిబి గర్ల్స్ జూనియర్ కాలేజీ విద్యార్థినిలు 80 మంది ఎగువ అహోబిలంలో శ్రమదానం చేయగా, ఆలయ పరిసరాలలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి భవనాసినిలో ఉన్న ప్లాస్టిక్ పదార్థాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం మేనేజర్ శ్రీనివాసన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలను సీజ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నారాయణ స్కూల్స్, కళాశాలలకు ఫైర్ సర్టిఫికెట్ లేవని, ఆ పాఠశాలలను, కళాశాలను సీజ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఫైర్ సర్టిఫికేట్ లేని నారాయణ కాలేజీ,స్కూల్స్‌పై నంద్యాల అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డికి ఎఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ధనుంజయుడు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని సంజీవ్ నగర్ ఏరియాలో ఉన్నటువంటి నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం 4 అంతస్తుల్లో జూనియర్ కళాశాల నిర్వహిస్తూ ఫైర్ సర్టిఫికెట్ రెన్యువల్ లేకుండా, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా, ఫైర్ సర్టిఫికెట్ కు సంబంధించినటువంటి పరికరాలను పెట్టాలంటే పెట్టి తూతూ మంత్రంగా వాటి నిర్వహణ చేస్తున్నారని వారన్నారు. అంతే కాకుండా నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ సెంటర్లో ఉన్నటువంటి నారాయణ స్కూల్ యాజమాన్యం కూడా నాలుగంతస్తుల బిల్డింగ్లో పాఠశాల నిర్వహిస్తూ ఫైర్ సర్టిఫికెట్ రెన్యువల్ లేకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా అగ్నిమాపక అధికారులు చూడడానికి మాత్రమే ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన పరికరాలను అమర్చి తూతూ మంత్రంగా వాటి నిర్వహణ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సుధాకర్, నరేష్ లు పాల్గొన్నారు.